ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

అనంతపురం

జిల్లా వార్తలు

శనివారం 6 జనవరి 2024

సారీ.. అన్నగారూ..!



ఉన్నత విద్యారంగాన్ని సంస్కరించి, కొత్త పుంతలు తొక్కించిన నాయకుడు ఎన్టీఆర్. ఆయన సేవలకు గుర్తుగా.. జేఎన్‌టీయూలో అధునాతన ఆడిటోరియానికి 'నందమూరి తారకరామారావు కళాక్షేత్రం' అని పేరు పెట్టుకుని గౌరవించుకున్నారు. వర్సిటీ స్నాతకోత్సవం శనివారం ఇక్కడే జరుగుతోంది. రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. కానీ, అన్నగారి అందమైన విగ్రహం రంగు వెలసినా, పెచ్చులూడినా వర్సిటీ అధికారులు పట్టనట్లు వ్యవహరించారు.

- అనంతపురం సెంట్రల్

నేడు జేఎన్‌టీయూ స్నాతకోత్సవం

హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

అనంతపురం సెంట్రల్, జనవరి 5: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ శనివారం జిల్లాకు వస్తున్నారు. జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొంటారు. ఉదయం 10.30 గంటలకు వర్సిటీలోని గెస్ట్‌హౌస్‌కు చేరుకుని, కాసేపు సేదతీరుతారు. అనంతరం వేడుకలు నిర్వహించే ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో విద్యార్థులకు పట్టాలు అందజేసి.. గోల్డ్ మెడల్స్‌తో సత్కరిస్తారు. అనంతరం బుక్కరాయసముద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో పాల్గొంటారు. (వివరాలు 7లో...)



సిద్ధమైన ఆడిటోరియం



ఇంతేనయ్య.. తెలుసుకోవయ్య!

వాడుకుని వదిలేస్తున్న వైసీపీ అధినేత

- అన్నా.. నీకు టిక్కెట్ లేదు.. పో..!
- కాపు ముఖం మీదే చెప్పేసిన సజ్జల
- నమ్మించి గొంతు కోస్తివే.. గుడ్‌బై జగన్..!

- సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద కాక పుట్టించిన కాపు
- రెండు దుర్గాల్లో బరిలోకి దిగుతామని ప్రకటన
- తాజా పరిణామాలతో సిట్టింగ్‌లకు గుబులు





అనంతపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి వైసీపీ అధినాయకత్వం టిక్కెట్ నిరాకరించింది. ఈ విషయాన్ని కాపు మొహం మీదే ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పేశారు. దీన్ని కాపు తీవ్ర అవమానంగా భావించారు. జగన్‌ను నమ్మితే గొంతు కోశారని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం ఎదుటే మీడియా వద్ద తీవ్ర ఆవేదన చేశారు. మంత్రి పదవి ఇస్తానని రెండుమార్లు మోసం చేసిన జగన్, చివరికి టిక్కెట్ లేదని గొంతు కోశారని నిప్పులు చెరిగారు. సీఎం జగన్ తమ జీవితాలను సర్వనాశనం చేశారని అన్నారు. వైఎస్సార్ చిత్రపటాన్ని దేవుడి గదిలో పెట్టుకుని పూజించే తమపట్ల జగన్ ఇలా వ్యవహరిస్తారని ఊహించలేదని కాపు అన్నారు. తమ సత్తా ఏమిటో చూపుతామని హెచ్చరించారు. వైసీపీ తనకు టికెట్ ఇవ్వకపోయినా ఎన్నికల బరిలో ఉంటామని, స్వతంత్రంగా గాని, అవకాశం ఇచ్చే ఇతర పార్టీల తరఫునగాని పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తాను కళ్యాణదుర్గం నుంచి, తన భార్య లేదా కుమారుడు రాయదుర్గం నుంచి పోటీ చేస్తామని కుండ బద్ధలు కొట్టారు. అధికార వైసీపీలో కాపు వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. రెండు నియోజకవర్గాల్లో కాపు కుటుంబం పోటీకి సిద్ధపడుతున్న నేపథ్యంలో వైసీపీ శ్రేణుల్లో ఆసక్తికర చర్చ మొదలైంది.

ఆ ఇద్దరిలో గుబులు..

అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జిగా వైసీపీ ప్రకటించింది. అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఉష శ్రీచరణ్‌ను పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పంపించారు. మంత్రిని కళ్యాణదుర్గం నుంచి తప్పించడం ఆమె వర్గీయులను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ఎంపీ తలారి రంగయ్య, మంత్రి ఉషశ్రీచరణ్ వర్గాల మధ్య ఆది నుంచి పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. కళ్యాణదుర్గానికి చెందిన పార్టీ బోయ సామాజికవర్గ నేతల్లో ముఖ్యుడైన తిప్పేస్వామి.. రంగయ్య మద్దతుదారుగా ఉన్నారు. తిప్పేస్వామి మంత్రి వ్యతిరేకవర్గంగా కొనసాగుతున్నారు. ఈ కారణంగా ఎంపీ తలారి రంగయ్యకు సహకరించే ప్రసక్తే లేదన్న సంకేతాలను ఉష శ్రీచరణ్ వర్గం పంపుతోంది. అధికార పార్టీలో ఇప్పటికే ఈ తలనొప్పి ఉండగా, కాపు రామచంద్రారెడ్డి కళ్యాణదుర్గం బరిలో దిగితే రంగయ్యకు దబిడి దిబిడే అంటున్నారు. మరోవైపు రాయదుర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కాపు రామచంద్రారెడ్డి తన భార్యను బరిలోకి దించేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఇక్కడా అధికార పార్టీ అభ్యర్థికి కష్టాలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. రెండు దుర్గాల్లోనూ అధికార పార్టీ అభ్యర్థులకు కాపు వ్యాఖ్యలు దడ పుట్టిస్తున్నాయని ఆ పార్టీవారే అంటున్నారు.



సిట్టింగ్‌లకు టెన్షన్



వైసీపీ అధినేత, సీఎం జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు పుట్టిస్తున్నాయి. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు సిట్టింగ్‌లకు జగన్ షాక్ ఇచ్చారు. దీంతో మిగిలిన ఆరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు కంటిమీద కునుకు కరువైంది. అధినాయకత్వం ఏ నిర్ణయం తీసుకుంటుంటోందనని అభద్రతాభావంలో కొట్టుమిట్టాడుతున్నారు. టికెట్ ఉంటుందా..? ఊడుతుందా...? అని పార్టీ పెద్దల ద్వారా ఆరా తీస్తున్నారు. గుడ్డిలో మెల్ల అన్న చందంగా కళ్యాణదుర్గం నుంచి మంత్రి ఉష శ్రీచరణ్‌ను పెనుకొండకు పంపించారు. పార్టీ ఆదేశాల మేరకు పెనుకొండ నుంచి పోటీ చేస్తానని ఇప్పటికే ఆమె ప్రకటించారు. ఆమె ప్రకటనతో పెనుకొండ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ వర్గీయుల నుంచి నిరసనలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. 'శంకరన్న ముద్దు.. ఉష శ్రీచరణ్ వద్దు' అని అక్కడ ప్లకార్డులు ప్రదర్శించారు. కొత్త నియోజకవర్గంలో టిక్కెట్ దక్కినా.. అక్కడి అసమ్మతి రాగం మంత్రికి గుబులు పుట్టిస్తోంది.

నెక్స్ ఎవరు..?

జగన్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారు..? ఎవరికి షాక్ ఇస్తారు..? నెక్స్ ఎవరి వంతు..?



అన్న చర్చ అధికార పార్టీలో తీవ్రంగా సాగుతోంది. ఎమ్మెల్యేల్లో గుబులు, దిగులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం షాక్‌ల మీద షాక్‌లు ఇస్తుండటంతో ఎమ్మెల్యేలు వణికిపోతున్నారు. మంత్రి ఉష శ్రీచరణ్‌కన్నా పెనుకొండలో అవకాశమిచ్చారు. కాపు రామచంద్రారెడ్డికి టిక్కెట్టే లేదని మొహం మీదే చెప్పేశారు. కాపు పరిస్థితి చూశాక అధికార పార్టీ ఎమ్మెల్యేలు షాక్‌లోకి వెళ్లారు. అనంతపురం అర్బన్, ఉరవకొండ, గుంతకల్లు, శింగనమల, రాప్తాడు, తాడిపత్రి నియోజకవర్గాల సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొందరికి టిక్కెట్లు దక్కకపోవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఆ పార్టీ వర్గాల్లోనూ ఇదే అంశంపై జోరుగా చర్చ జరుగుతోంది.


రెడ్లకు కష్టమేనా..?



బీసీలకు కంచుకోటగా ఉన్న జిల్లాలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని వైసీపీ అధినాయకత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. అధికార పార్టీ సామాజికవర్గ ఎమ్మెల్యేల్లో అలజడి మొదలైంది. ఇప్పటికే ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన శింగనమలలో సిట్టింగ్ ఎమ్మెల్యేకి ఈసారి అవకాశం దక్కదనే అభిప్రాయం ఆ పార్టీలో వ్యక్తమవుతోంది. కొత్త వ్యక్తిని బరిలోకి దింపాలని వైసీపీ అధినాయకత్వం నిర్ణయానికి వచ్చినట్లు ఆ పార్టీ వర్గాలే బాహాటంగా చెప్పుకుంటున్నాయి. బీసీలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో అధికార పార్టీ సామాజికవర్గ ఎమ్మెల్యేలకు టిక్కెట్ ఇవ్వకూడదనే ఆలోచనలో వైసీపీ అధినాయకత్వం ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.

కాపును నమ్మని జగన్

అధికారం రాగానే అక్రమాలు.. సొంతపార్టీ వారిలోనే వ్యతిరేకత



రాయదుర్గం: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి వైసీపీ అధినాయకత్వం టిక్కెట్ నిరాకరించడానికి ఆయన అక్రమ వ్యవహారాలే కారణమని అధికార పార్టీవారే అంటున్నారు. చాపకింద నీరులా విస్తరించిన అసమ్మతి, వర్గపోరు ఆయనను దెబ్బకొట్టాయని అంటున్నారు. 2019 ఎన్నికల్లో కాలవ శ్రీనివాసులుపై విజయం సాధించిన కాపు, జగన్ విధేయుడిగా ఉంటూ ప్రభుత్వ విప్ హోదాను పొందారు. అప్పటి నుంచి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అడ్డుదారులన్నీ తొక్కారు. పార్టీ కోసం కాకుండా, స్వలాభం కోసం పనిచేశారని అపకీర్తిని మూటగట్టుకున్నారు. కాపు, ఆయన భార్య భారతి, కొడుకు ప్రవీణ్‌రెడ్డి ధనార్జనే ధ్యేయంగా పనిచేశారని ఆ పార్టీ నేతలు బాహాటంగా విమర్శిస్తున్నారు. వైసీపీ అధికారంలో వచ్చిన నెలకే ఇసుక దందా మొదలు పెట్టారు. కాపు ఇసుక టిప్పర్లు పోలీసులకు అడ్డంగా దొరికిన విషయాన్ని ప్రజలు నేటికి మరవలేదు. తన టిప్పర్లను వదిలేయాలని కణేకల్లు పోలీసు స్టేషన్ ఎదుట ఎమ్మెల్యే హోదా మరిచి కాపు ధర్నా కూడా చేశారు. దీంతో పార్టీ పెద్దలు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్ విశ్వాసం కోల్పోయి..

కాపు రామచంద్రారెడ్డికి టిక్కెట్ రాకపోవడానికి ప్రధాన కారణం జగన్ విశ్వాసం కోల్పోవడమేనని స్పష్టమవుతోంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాపు దందాలతో చెలరేగిపోయారని పార్టీ పెద్దల దృష్టికి వెళ్లింది. తనవాడైనా, పరాయి వాడైనా కప్పం కట్టాల్సిందే అన్నట్లు కాపు వ్యవహరించారని వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక దందా, రియల్ ఎస్టేట్, విద్యుత్‌శాఖలో అవుట్ సోర్స్ ఉద్యోగుల నియామకం, అంగన్‌వాడీ వర్కర్ల నియామకం, క్వారీ.. ఇలా అన్నింటిలో అందినకాడికి దోచుకొన్నాడని అంటున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో 90 శాతం కార్యకర్తలు ఆయనను వ్యతిరేకించారని సమాచారం. కాపు బరిలో ఉంటే ఓడిపోవడం తథ్యమని ఐప్యాక్ సర్వే తేల్చిందని, గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్న జగన్.. ఆయనకు చెక్ పెట్టారని అంటున్నారు.

పెద్దిరెడ్డికి ఫిర్యాదులు

అవినీతిపరుడైన కాపు రామచంద్రారెడ్డి నాయకత్వంలో తాము పనిచేయలేమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎదుట వైసీపీ నియోజకవర్గ నాయకులు పలువురు నిరసన గళం వినిపించారు. వైసీపీ తన సొంత పార్టీ అన్నట్లు కాపు వ్యవహరిస్తున్నారని, తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దుర్గంలో కాపు కుటుంబ పాలన సాగుతోందని, ఏ అవసరం వచ్చినా కాపును కాదని అమ్మవారి కరుణా కటాక్షాలు పొందాల్సి వస్తోందని, ఇది తమకు ఇబ్బందికరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలన్నీ కాపు రామచంద్రారెడ్డి పట్ల వ్యతిరేకతను పెంచి.. చివరికి టిక్కెట్ దక్కకుండా చేశాయి. నమ్ముకున్న పార్టీ నుంచి బయటకు వచ్చేసే పరిస్థితులను కల్పించాయి.



విహన్యశ్రీ మృతదేహం

ప్రాణం తీసిన హీటర్

చిన్నారి మృతి, తల్లి, చెల్లికి గాయాలు

తాడిపత్రి టౌన్, జనవరి 5: అప్పటి వరకూ అల్లరి చేస్తూ, ఆడుకుంటున్న బంగారు బిడ్డ. 'లాల పోసుకుందురు.. రా..' అని అమ్మ పిలవడంతో స్నానాల గదిలోకి వెళ్లింది. చెల్లిని చంకలో ఎత్తుకుని అమ్మ కూడా లోపలికి వచ్చింది. వేడి నీటికోసం పెట్టిన ఎలక్ట్రిక్ హీటర్‌ను పట్టుకుంది. అంతే..! కరెంట్ షాక్‌తో విలవిలలాడుతూ క్షణాల్లో కుప్పకూలింది. కాపాడబోయిన అమ్మ, తను ఎత్తుకున్న చెల్లి కూడా విద్యుదాఘాతానికి గురయ్యారు. చిన్నారి విహన్యశ్రీ(5) ప్రాణాలు కోల్పోయింది. తన అమ్మ, చెల్లి ఆస్పత్రిపాలయ్యారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో శుక్రవారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. కాలనీకి చెందిన వెంకటరమణ, నాగజ్యోతి దంపతులకు విహన్యశ్రీ, జ్యేష్ఠశ్రీ కూతుళ్లు. చిన్నారులకు స్నానం చేయించేందుకు తల్లి బాత్‌రూంలోకి తీసుకువెళ్లింది. నీటిని వేడి చేసేందుకు అప్పటికే హీటర్ పెట్టింది. విహన్యశ్రీ హీటర్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. కాపాడేందుకు యత్నించిన తల్లి నాగజ్యోతి, తను ఎత్తుకున్న జ్యేష్ఠశ్రీ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. భర్త వెంకటరమణ గుర్తించి, ఇరుగుపొరుగువారి సాయంతో ముగ్గురినీ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే విహన్యశ్రీ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నాగజ్యోతి, జ్యేష్ఠశ్రీకి ప్రాణాపాయం తప్పింది.



చికిత్స పొందుతున్న నాగజ్యోతి

ఈసీ ఆదేశాలను పాటించాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 5: ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను విధిగా పాటించాలని కలెక్టరు గౌతమి అధికారులకు ఆదేశించారు. ఎన్నికల అధికారులతో శుక్రవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. డబుల్ ఎంట్రీ ఓటర్ల విషయంలో ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల వివరాలను అందించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిర్వహణకు వసతులు ఉన్నదీ లేనిదీ పరిశీలించి, సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈవీఎం ఓటింగ్ గురించి పోలింగ్ కేంద్రాల పరిధిలో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దారు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను వీధుల్లోకి నెట్టారు



సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

సీఎం జగన్‌పై నాయకుల ఆగ్రహం

25వ రోజు కొనసాగిన సమ్మె

అనంతపురం విద్య, జనవరి 5: సీఎం జగన్ తమను వీధిపాలు చేశారని అంగన్‌వాడీ కార్యకర్తలు మండిపడ్డారు. ఇచ్చిన మాటకు కట్టుబడాలని, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వారు చేపట్టిన సమ్మె 25వ రోజు కొనసాగింది. కలెక్టరేట్ వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. మూతికి నల్ల గుడ్డలు కట్టుకుని, చేతికి గుడ్డలతో సంకెళ్లు వేసుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించేవరకూ పోరాడుతామని అన్నారు. గ్రాట్యుటీ వెంటనే అమలు చేయాలని, వేతనాలను రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం అంగన్‌వాడీలను తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనాయుడు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు జమున విమర్శించారు. వేలాది మంది జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి అంగన్‌వాడీల చేతిలో పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, రాప్తాడు మండల కార్యదర్శి పోతులయ్య, అంగన్‌వాడీ యూనియన్ అనంతపురం, రూరల్ నాయకులు జమున, అరుణ, యశోద, హరిప్రియ, రేవతి తదితరులు పాల్గొన్నారు.



అరగుండు.. అరమీసం..!

పారిశుధ్య కార్మికుల నిరసన

అనంతపురం క్రైం, జనవరి 5: సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతికూల ధోరణిని వీడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు అన్నారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నగరపాలిక కార్యాలయం వద్ద 11వ రోజు ఆందోళనలు కొనసాగాయి. కార్మికులు కార్పొరేషన్ ఎదుట పొర్లుదండాలు పెట్టారు. యూనియన్ నగర అధ్యక్షుడు బండారు ఎర్రిస్వామి అరగుండు, అరమీసంతో నిరసన తెలిపారు. వివిధ ప్రాంతాల్లో చెత్త తరలిస్తున్న వాహనాలను కార్మికులు అడ్డుకున్నారు. ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్మికులు నగరంలో భిక్షాటన చేశారు. ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీ మేరకు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు.




ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

- సర్వాంగ సుందరంగా ముస్తాబైన వర్సిటీ
- హాజరు కానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- 46 మంది విద్యార్థులకు బంగారు పతకాలు

జేఎన్‌టీయూలో నేడు

పట్టాల పండుగ

అనంతపురం సెంట్రల్, జనవరి 5: విద్యార్థుల కలలు సాకారం అయ్యేలా శనివారం జేఎన్‌టీయూ 'పట్టా'భిషేకం జరగనుంది. వేడుకలకు వర్సిటీలోని ఎన్‌టీ రామారావు ఆడిటోరియం ముస్తాబు అయ్యింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవాలకు చాన్స్‌లర్ హోదాలో హాజరుకానున్నారు. 2021-22, 2023 సంవత్సరంలో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తిచేసిన విద్యార్థులకు గవర్నర్ పట్టాలను ప్రదానం చేయనున్నారు. ఉత్తమ మార్కులు సాధించిన 46మంది విద్యార్థులను బంగారు పతకాలతో సత్కరిస్తారు.

భారీ బందోబస్తు...

స్నాతకోత్సవానికి గవర్నర్ రానుండంతో జేఎన్‌టీయూ పరిసరాలను ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గవర్నర్ పర్యటించే ప్రాంతాన్ని ఆర్డీఓ రాణి సుస్మిత అణువణువూ పరిశీలించారు. గెస్ట్‌హౌస్, ఆడిటోరియం, వేదిక ప్రాంగణాన్ని వర్సిటీ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. జేఎన్‌టీయూ నుంచి పాతవూరు సంగమేష్ సర్కిల్ వరకు పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పాసులు అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

రిహార్సల్...

13వ స్నాతకోత్సవాల రిహార్సల్స్ శుక్రవారం నిర్వహించారు. గవర్నర్‌ను గౌరవంగా వేదికమీదకు తీసుకెళ్లేందుకు నిర్వహించే ప్రక్రియను వీసీ రంగజనార్దన, రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్‌తోపాటు ఇతర అధికారులతో రిహార్సల్ నిర్వహించారు. వేడుక ప్రారంభించడానికి గవర్నర్ నుంచి తీసుకునే అనుమతి, ప్రసంగాలు. పట్టాలు, మెడల్స్ అందజేయం తదితర ప్రక్రియలను ముందస్తుగా పరిశీలించారు.

నేడు బీకేఎస్‌కు గవర్నర్

బుక్కరాయసముద్రం,: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ మైదానంలో శనివారం జరగనున్న 'వికసిత్ భారత్' సంకల్ప యాత్ర కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్‌నజీర్ పాల్గొననున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. నాలుగు రోజులుగా జిల్లా కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్ అధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బీకేఎస్ అంతటా పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు 250 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొం టున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి తెలిపారు. గవర్నర్ మధ్యాహ్నం 2 గంటలకు బుక్కరాయసముద్రంకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమి తెలిపారు. కార్యక్రమంలో తొలుత కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రదర్శన క్షేత్రాలను సందర్శిస్తారని, అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 పథకాలకు సంబంధించి మహిళా లబ్ధిదారులుతో నేరుగా గవర్నర్ ముఖాముఖి అవుతారన్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి రోడ్డులోకి ఎవ్వరు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

పోలీసులపై బురద జల్లితే

ఊరుకోం

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం, జనవరి 5: ప్రజల దృష్టిని మళ్లించేందుకు పోలీసులపై బురద జల్లే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికలపై సత్యదూరమైన పోస్టులు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. 'అనంతపురం కోవూరు నగర్‌లోని ఓ పార్కులో గంజాయితో ఎంజాయ్' అంటూ ముందు వెనుక ఆలోచించకుండా సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టులు పెట్టారని తెలిపారు. కోవూరు నగర్ పార్కుపైనే కాదు.. జిల్లాలోని అన్ని పార్కులపై ప్రత్యేక నిఘా వేశామని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగకుండా, ఈవ్ టీజింగ్ జరుగకుండా పోలీసులు చర్యలు చేపట్టారని తెలిపారు. గత మూడు నెలలలో 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 40 మందిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. అనంతపురంతో పాటు గుత్తి, గుంతకల్లు ప్రాంతాలలో ప్రత్యేక నిఘా వేసి, గంజాయితో సంబంధం ఉన్న వారిపై చర్యలు తీసుకున్నామని వివరించారు. పాత వీడియోలను మార్చి, కొత్తగా జరిగినట్లు క్రియేట్ చేసి పోస్టులు పెట్టడం, అసభ్యకరంగా ఉన్న డీప్ ఫేక్ వీడియోలు పెట్టి వేధించడం వంటి పనులు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరిపైన అసత్య ప్రచారాలు చేసినా, తప్పుడు పోస్టులు పెట్టినా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని, చట్టపరమైన కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలు, కించపరిచే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఏవైనా సమస్యలు ఉన్నా, ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నా తన ఫోన్ నంబర్‌కు (9440796800) తెలియజేయాలని కోరారు. సోషల్ మీడియాలో వేధిస్తున్నా, సైబర్ మోసాలు జరిగినా వెంటనే 1930 నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించడంతో పాటు సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

ధర్మవరాన్ని సమస్యలకు నిలయంగా మార్చేశారు

- ఏ కాలనీలో చూసినా ప్రజల కష్టాలే
- రెండో రోజు పాదయాత్రలో పరిటాల శ్రీరామ్
- గాలి మాటలను నమ్మొద్దు.. ధర్మవరం శ్రీరామ్‌దే
- మాజీ మంత్రి పరిటాల సునీత

ధర్మవరం, జనవరి 5: ధర్మవరం పట్టణాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి సమస్యలకు నిలయంగా మార్చేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాచైతన్య పాదయాత్రలో భాగంగా రెండోరోజు శుక్రవారం పరిటాల శ్రీరామ్ పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించారు. ఉదయం శాంతినగర్‌లోని గ్యాస్ గౌడౌన్ వద్ద ప్రారంభమైన పాదయాత్ర శాంతినగర్, చంద్రబాబునగర్, శారదానగర్, శివానగర్, తిక్కస్వామినగర్, సీపీఐకొట్టాల, కేశవనగర్, 17వవార్డు సంజయ్‌నగర్ వరకు సా గింది. ఈ సందర్భంగా పలు కాలనీల్లో ప్రజలు మగ్గాల వల్ల తమకు ఏ మాత్రం గిట్టుబాటు కావడంలేదని, నిరుద్యోగ సమస్య, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను శ్రీరామ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ఎంతోమందికి రేషన్‌కార్డులు తొలగించారని, అర్హత ఉన్నా వృద్ధాప్య వితంతు పింఛన్‌లు అందడం లేదన్నారు. ప్రతి బాధితులు వద్ద ఫోన్ నెంబర్ తీసుకుని, టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

● కొందరు మైనార్టీ నేతలు పరిటాల శ్రీరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వక్ఫ్‌ఆస్తుల పరిరక్షణ, ముస్లింలను వివక్షకు గురికాకుండా అట్రాసిటీ చట్టం, దుల్హన్ పథకం సొమ్ము రూ.లక్ష వరకు పెంచాలని, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు, 50శాతం సబ్సిడీతో రుణాలువంటి అంశాలను శ్రీరామ్ దృష్టికి తెచ్చారు. వీటిపై చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని, మొదటి నుంచి ముస్లిం మైనార్టీలకు పరిటాలరవితో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. వారి అభిమానాన్ని నిలుపుకుంటామన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

శ్రీరామ్ పాదయాత్రలో భాగంగా 5వ వార్డుకు వచ్చిన సమయంలో వైసీపీలో కీలకంగా పనిచేస్తున్న 30 మంది యువకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వార్డులోకి రాగానే పలువురు యు వకులు భారీ స్వాగతం పలికారు. అనంతరం వారందరినీ శ్రీరామ్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలోనే యువత భవిష్యత్తు బాగుంటుందన్న ఉద్దేశంతోనే తాము పార్టీలోకి చేరినట్లు పేర్కొన్నారు. పార్టీలోకి చేరిన వారిలో నిజాం, అరవింద్, మహమ్మద్, కుల్లాయి, మనీ, ప్రశాంత్‌రెడ్డి, యతీష్, వెంకటేశ్ తదితరులున్నారు.

టీడీపీజెండా ఎగురవేసేది శ్రీరామే
- మాజీ మంత్రి సునీత

కార్యకర్తలు గాలి మాటలు నమ్మవద్దని, ధర్మవరంలో టీడీపీ జెండా ఎగురవేసేది పరిటాలశ్రీరామే అని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. రెండోరోజు పాదయాత్రలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ..పరిటాలశ్రీరామ్ పాదయాత్రకు మంచి స్పందన కనిపిస్తోందన్నారు. అన్ని వర్గాల వారు ఆయనను కలిసేందుకు వస్తున్నారన్నారని, సమస్యలను నోట్ చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. పరిటాల రవి కుటుంబంతో ధర్మవరం ప్రాంతానికి ఎంతో అనుబంధం ఉందని శ్రీరామ్‌ను ఒక మనవడిలా అన్నలా, తమ్ముడిలా ప్రజలు భావిస్తున్నారన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పరిటాల శ్రీరామ్, పరిటాల సునీత

పంప్‌హౌస్‌కు తాళం

● శ్రీరామిరెడ్డి కార్మికుల ఆందోళన ఉధృతం

కళ్యాణదుర్గం, జనవరి 5: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తమ ఆందోళన ఉధృతం చేశారు. ఈక్రమంలోనే శుక్రవారం పంప్‌హౌస్‌కు తాళాలు వేసి, బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 15 ఏళ్లుగా ఈ పథకంలో పనిచేస్తున్నామని నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలి అని, జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పలు వినూత్న నిరసనలు చేస్తున్నారు. ఫేజ్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 225 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. 325 గ్రామాలకు తాగు నీటి సరఫరా ఆగి పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


నినాదాలు చేస్తున్న కార్మికులు

వారు లంచం అడిగారు : ఏసీబీ డీఎస్పీ



చెన్నేకొత్తపల్లి, జనవరి 5: కులాంతర వివాహ వివాదం కేసులో లంచం డిమాండ్ చేసిన రామగిరి సీఐ చిన్నగౌస్, కనగానపల్లి ఎస్ఐ హనుమంతరెడ్డిలపై ఆధారాలు రుజువయ్యావని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అనంతపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు. సీకేపల్లి పోలీస్టేషన్‌పై గురువారం ఏసీబీ అధికారులు దా డులు నిర్వహించడంతో సీఐ పారిపో గా కనగానపల్లి ఎస్ఐను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. వివరాలను శుక్రవారం విలేకరులకు ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. కనగానపల్లి మండలంలో దం పతుల మధ్య విభేదాలకు సంబంధించి తగరకుంటకు చెందిన వడ్డే నరేశ్‌పై కేసు నమోదు కాగా దాని మాఫీ కోసం సీఐ, ఎస్ఐలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని సంప్రదించారన్నారు. ఒప్పందం ప్రకారం సీకేపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి డబ్బును అందజేస్తుండగా, ఏసీబీ అధికారులను పసిగట్టి సీఐ పారిపోయాడని తెలిపారు. ఎస్ఐ హనుమంతరెడ్డి కూడా సీఐ ద్వారా విషయం తెలుసుకుని పారిపోతుండగా, వెంబడించి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విచారణలో సీఐ, ఎస్ఐలు నేరం చేశారని రుజువు అయ్యిందని తెలిపారు. ఎస్ఐ హనుమంతరెడ్డిని అరెస్టు చేసి, కర్నూలు ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని, పరారీలో ఉన్న సీఐ చిన్నగౌస్ కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. సీఐ, ఎస్ఐ విషయంలో ఎవరైనా బాధితులుంటే ఏసీబీని సంప్రదించవచ్చన్నారు.

తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు, జనవరి5: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తిరుపతి-సికింద్రాబాద్ మధ్య సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలు (నెం. 07065)ను నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ రైలు తిరుపతిలో ఈనెల 10న ఉదయం ఐదున్న ర గంటలకు బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తిరుపతి, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, వనపర్తి రోడ్డు, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

తనిఖీల్లో పట్టుబడ్డ రూ. 17.95 లక్షలు

డీ.హీరేహాళ్, జనవరి 5: జిల్లా ఎస్పీ ఆదేశాలతో కర్ణాటక సరి హద్దు చెక్ పోస్టుల వద్ద సెబ్, పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా నగదు పట్టుబడింది. సెబ్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బళ్లారి నుంచి బెంగళూరుకు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 17.95 లక్షల నగదును సీజ్ చేసినట్లు సెబ్ అదనపు ఎస్పీ జీ రామకృష్ణ తెలియజేశారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలతో కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సెబ్ విభాగం, పోలీసులు తనిఖీలు చేపట్టారు. సెబ్ అదనపు ఎస్పీ జీ రామకృష్ణ, డీ.హీరేహాళ్ ఎస్ఐ రంగడు యాదవ్, సెబ్ ఎస్ఐ వీరస్వామిల ఆధ్వర్యంలో సెబ్, పోలీసులు ఓబుళాపురం చెక్‌పోస్టు వద్ద బళ్లారి నుంచి బెంగళూరు వెళుతున్న ఓ కారుని తనిఖీ చేశారు. తమిళనాడులోని హోసూరు జిల్లా శూలగిరిలో ఉన్న సోనాజీ ఇండస్ట్రీస్, మహావీర్ ఎక్స్‌పోర్ట్ కంపెనీ యజమాని హరిరామ్, అతని మిత్రుడు బెంగళూరు రవి అరోరాలు కారులో ఉన్నారు. డబ్బుకు వారు ఎ లాంటి బిల్లులు చూపించకపోవ డం వల్ల ఆ డబ్బుని సీజ్ చేసి ఐటీ శాఖకు పంపుతున్నామని సెబ్ అదనపు ఎస్పీ వెల్లడించారు.


పట్టుబడ్డ నగదును చూపుతున్న అదనపు ఎస్పీ రామకృష్ణ

దళారీ వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

కణేకల్లు, జనవరి 5: మండలంలోని మాల్యం గ్రామానికి చెందిన పప్పుశనగ దళారీ తిప్పారెడ్డికి సంబంధించిన పప్పుశనగ విత్తనాల వాహనాన్ని గ్రామస్థులు శుక్రవారం అడ్డుకుని గొడవకు దిగారు. మాల్యం గ్రామానికి చెందిన తిప్పారెడ్డి ప పప్పుశనగ వ్యాపారం చేస్తూ దాదాపు 65 మంది రైతులకు రూ.5.5 కోట్లు ఐపీ పెట్టి, ఇటీవల నోటీసులు కూడా పంపించా డు. గ్రామం వదలి పరారయ్యాడు. దీంతో అతడి పొలంలో పండిన పప్పుశనగను అదే గ్రామానికి చెందిన మరే గౌడ అనే వ్యక్తి కోత కోయించి, 169 సంచుల్లో వాహనంలోకి ఎక్కించి వేరే చోటికి తరలించేందుకు శుక్రవారం ప్రయత్నించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న తిప్పారెడ్డి బాధితులు మాల్యంకు చేరుకుని ఆ వాహనాన్ని పట్టుకున్నారు. దీంతో మరేగౌడ తాను తిప్పారెడ్డి పొలాన్ని కౌలుకు చేశానని ఇది తనవేనని బుకాయించేందుకు ప్రయత్నించాడు. గ్రామస్థులు ససేమిరా అనడంతో పోలీసులు రంగప్రవేశం చేశా రు. సంచుల విలువ రూ. ఐదు లక్షలు ఉంటుందని, వేర్‌హౌస్‌లో ఉంచాలని పోలీసులు, పెద్దలు తీర్మానించడంతో సమస్య సద్దుమణిగింది.


వాహనాన్ని అడ్డుకుంటున్న గ్రామస్థులు

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం అర్బన్, జనవరి 5 : పశువుల షెడ్ల నిర్మాణం కోసం పాడి రైతులు దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం శుక్రవారం ప్రకటించారు. ఉపాధి హామీ పథకం నిధులతో షెడ్ల నిర్మాణం చేపడ్తామని, రెండు పాడి పశువుల షెడ్ల నిర్మాణం కోసం రూ.లక్ష, 4 పాడి పశువుల షెడ్ల కోసం రూ.1.50 లక్షలు, 6 పాడి పశువుల కోసం రూ.1.80 లక్షలు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు.పాడి రైతులు స్థానిక వెటర్నరీ ఆస్పత్రుల్లో అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకుని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాబితా విడుదల

అనంతపురం టౌన్ జనవరి 5 : జిల్లా వైద్య శాఖ పరిధిలో భర్తీ చేయనున్న కాంట్రాక్ట్ వైద్యపోస్టులకు అభ్యర్థుల ఫైనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవీ శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. డీటీసీ విభాగానికి సంబంధించి ఒక మెడికల్ ఆఫీసర్ పోస్టు, ఒక జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పోస్టు, ఒక టీబీహెచ్ఐవీ సూపర్‌వైజర్‌పోస్టు, ఒక జిల్లా పీపీఎంకోఆర్డినేటర్ పోస్టు, ఒక అకౌంటెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచామని, ఎంపికైన అభ్యర్థులు ఈనెల 8వతేదీన తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి రావాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు.



అభివృద్ధికి విరోధి.. తోపుదుర్తి

ఎమ్మెల్యేపై మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజం

ధర్మవరంరూరల్, జనవరి 5: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడాన్ని అటుంచి.. అభివృద్ధికి విరోధిగా మారాడని మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజమెత్తారు. కనగానపల్లి మండలం చంద్రాచర్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రకాష్‌రెడ్డికి రియల్ ఎస్టేట్ వ్యాపారం మీద ఉన్న శ్రద్ధ.. పరిశ్రమల స్థాపన, ప్రజా సమస్యల పరిష్కారంపై లేదని మండిపడ్డారు. పంచా యతీలో గతంలో గేరు చిక్కుడు పరిశ్రమ ఏర్పాటుకు తాము చర్యలు తీసుకున్నామని, వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పరిశ్రమ ఏర్పాటు గురించి ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఆ పరిశ్రమ స్థానంలో మరొకటి తీసుకుని రావచ్చన్నారు. కానీ ఎమ్మెల్యేకు ఎంతసేపు రియల్ ఎస్టేట్, భూదందాలపై శ్రద్ధ ఎక్కువగా ఉందన్నారు. కనగానపల్లి మండల పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేయించి కోట్ల రూపాయిలు సంపాదిస్తున్నారన్నారు. సామా న్యులకు సెంటు భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం అనేక షరతులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తోందని, వైసీపీ నాయకులకు మాత్రం ఇష్టానుసారంగా భూ దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సారి ఎన్నికల్లో వైసీపీకి ఘోర ఓటమి తప్పదన్నారు.



చంద్రాచర్లలో కరపత్రాలను పంచుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య, సుధాకర్ చౌదరి, తెలుగు యువత బట్టాసురేష్ చౌదరి, తలారి రాజప్ప, గిరిశాల కుమార్, రవి, నారాయణస్వామి, నాగరాజు, జనా, నాయుడు, బొడమల్లు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : ఎంసీపల్లి పంచాయతీలో గరిమేకలపల్లిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు చేపట్టారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, మాజీ ఎంపీపీ పరంధామయాదవ్, మాజీ సర్పంచ్ ముత్యాలు, గరిమేకలపల్లి మారుతీప్రసాద్, వెంకటేశ్, చలపతి, నాగేంద్ర పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక : గరిమేకలపల్లిలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. వీరేశ్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హరిజన తిపన్న తదితర కుటుం బ సభ్యులను టీడీపీలోకి నారాయణ చౌదరి ఆహ్వానించారు.

అనంతపురంరూరల్: మండలంలోని పాపంపేట పంచాయతీ విద్యారణ్యనగర్‌లో టీడీపీ నాయకులు బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ రామాంజినేయులు, బూత్ కన్వీనర్లు బాబావలి, ఖలీఫా, చిరంజీవి, మంజుల, సైఫుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.





గరిమేకలపల్లిలో నారాయణచౌదరి ప్రచారం, పాపంపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

సమ్మెతోనూ సొమ్మే..!

- అవినీతిపరులకు కాసుల పంట
- కొందరు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు
- చెత్త తరలించేందుకు టెండర్
- రూ.25 లక్షల దోపిడీకి స్కెచ్..!

అనంతపురం క్రైం, జనవరి 5: వైసీపీ పాలనలో దోచుకున్న వారికి దోచుకున్నంతలా తయారైంది. కొందరు పాలకులు, అధికారులు ఏ మాత్రం వీలున్నా దోపిడీలకు తెగపడుతున్నారు. ప్రస్తుతం మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెనూ కొందరు కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు సొమ్ము చేసుకొంటున్నారు. కార్మికులు 11 రోజులుగా సమ్మెలో ఉండటంతో చెత్త ఎత్తడంలేదు. రెగ్యులర్ కార్మికులతో సైతం ఆ పని చేయనివ్వకుండా వారు అడ్డుకుంటున్నారు. దీన్ని అవినీతిపరులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. చెత్తను ఎత్తివేయడానికి రూ.8 లక్షలకు టెండరు పిలిచారు. ఆ టెండర్‌ను ఓ ప్రజాప్రతినిధి సమీప బంధువు దక్కించుకున్నట్లు సమాచారం. అతను ఎనిమిది ట్రాక్టర్లు, ఎనిమిది జేసీబీలు (ఎక్స్‌కవేటర్), ప్రైవేట్ వ్యక్తులను రంగంలోకి దింపారు. ఆ చెత్తను డంపింగ్ యార్డ్‌లో వేయాల్సి ఉంది. ఆ పనులనూ కార్మికులు అడ్డుకోవడంతో ఆ అవినీతి పరులకు మరింత కలిసివచ్చేలా చేసింది. పనులు చేయకున్నా.. చేసినట్లు చూపి.. బిల్లు పెట్టుకోవచ్చని ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. అలా చేయడానికి వారికి అనుకూలమైన ఇంజ నీర్లకు ఇంకాస్త కమీషన్ ఎక్కువిస్తే సంతకా లు పెడతారనేది వారి ధీమా. ఇక అదనంగా నామినేషన్ వర్క్‌ల రూపంలోనూ కొందరు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. వీరు కూడా పాలకవర్గంలోని కీలక నేతల సిఫార్సులున్న కాంట్రాక్టర్లేనని సమాచారం. ఇలా మొత్తం రూ. 25 లక్షల వరకు దోపిడీకి స్కెచ్ వేశారు. గార్బేజ్, కొవిడ్, మలేరియా కార్మికులకు నెలకు రూ.15వేలు ఇవ్వలేని పాలకులు, అధికారులు రూ.లక్షలకు లక్షలు బిల్లులు ఎలా పెట్టుకుంటున్నారని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మండిపడుతున్నారు.



చెత్త తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న కార్మికులు

ప్రజాచైతన్య యాత్రకు సంఘీభావం

అనంతపురంరూరల్, జనవరి 5: తెలుగుదేశం పార్టీ ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ధర్మవరంలో చేపట్టిన ప్రజా చైతన్యయాత్రకు రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని మండల కన్వీనర్లు సంఘీభావం తెలిపారు. శుక్రవారం ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌లో జరుగుతున్న ఆ కార్యక్రమంలో మండల కన్వీనర్లు జింకా సూర్యనారాయణ, పంపు కొండప్ప, యాతం పోతులయ్య, ముట్టాల శ్రీనివాసులు, సుధాకర్, ముత్యాలురెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. తెలుగు రైతు రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో కురుగుంటకు చెందిన పలువురు టీడీపీ నాయకులు శుక్రవారం ప్రజా చైతన్యయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మేంద్ర, రంగాయాదవ్, జయరాం, జాఫర్, రమణ, వెంకటేష్, నాగేంద్ర అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.



పరిటాల శ్రీరామ్‌కు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ మండల కన్వీనర్లు, తెలుగు రైతు అధ్యక్షుడు నారాయణస్వామి



ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

అనంతపురంరూరల్ : నగరంలోని గంగానగర్ ఎక్స్‌టెన్షన్ జానకీరామ్‌నగర్ కెనాల్ రోడ్డు సమీపంలో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ 11కేవీ లైన్ తీగలు ప్రస్తుతం చాలా తక్కువ ఎత్తులో ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు ఈ సమస్య పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.



తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

వైసీపీ పాలనలో వడ్డెర్లకు రక్షణ కరువు

అనంతపురం అర్బన్, జనవరి 5: వైసీపీ పాలనలో వడ్డెర్లకు రక్షణ కరువైందని వడ్డెర్ల సంక్షేమ సంఘం నాయకులు సిమెంట్ పోలన్న, కుంచెపు వెంకటేష్ మండిపడ్డారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని వడ్డెర్ల సంక్షేమ సంఘం కార్యాలయంలో వారు మాట్లాడారు. తాజాగా కడప జిల్లా బద్వేల్‌లో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన అన్నదమ్ములను కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా నడిరోడ్డుపై అతికిరా తకంగా హత్య చేయడం దారుణమన్నారు. నిందితులపై పోలీసులు ఇప్పటి దాకా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, వడ్డెర్లపై జరుగుతున్న దాడులు, హత్యలను ప్రభుత్వం అరికట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

టీడీపీని గెలిపించుకుందాం

అనంతపురంరూరల్, జనవరి 5: టీడీపీ హయాంలోనే బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని, కావున బీసీలందరూ మమేకమై మళ్లీ తెలుగుదేశాన్ని గెలిపించుకుందామని మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ పార్టీ కార్యాలయం నుంచి గురువారం ప్రారంభమైన జయహో బీసీ ప్రచార వాహనాన్ని శుక్రవారం ఉదయం మండలంలోని సిండికేట్ నగర్‌కు చేరింది. ఈ సందర్భంగా జింకా సూర్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చంద్రబాబుకు.. నియోజకవర్గంలో పరిటాల సునీతకు అండగా ఉందామన్నారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ, కుమ్మర శాలివాహన సాధికార కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఓబులపతి, అనంతపురం, సత్యసాయి జిల్లాల కన్వీనర్లు ప్రదీప్‌కుమార్, రామాంజినేయులు, మాజీ ఎంపీటీసీ సర్దానప్ప, దూదేకుల సాధికార ఫెడరేషన్ రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు అల్లీపీర, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు అంజినేయులు, రాచనపల్లి గ్రామకమిటీ అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు మల్లికార్జున, రామాంజి, రాము పాల్గొన్నారు.

ప్రకాష్‌రెడ్డీ.. నీ నేరచరిత్ర మరువద్దు

ఆత్మకూరు, జనవరి 5: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన నేర చరిత్రను మరచి.. పరిటాల కుటుం బంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు మండిపడ్డారు. శుక్రవారం స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అసాధ్యపు హామీలతో అధికారంలోకి వచ్చి.. అభివృద్ధి చేయడం చేతకాక.. దోపిడీలు, దౌర్జన్యాలతో సొంత ఆస్తులు పెంచుకొన్న నీకు ఓటమి తప్పదు. ఇక మీ మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు. తగురుకుంట కొండారెడ్డి కేసులో ముద్దాయిలు నీవద్దనే ఉన్నారు. మీ కుటుంబంలోని వారు కారుబాంబు కేసులోనూ ఉన్నారు. నిన్ను గత ఎన్నికల ముందు పోలీసులు ఎందుకు అరెస్టు చేశారో ప్రజలకు చెప్పాలి. నాలుగన్నరేళ్లల్లో నీవు ఏం అభివృద్ధి చేశావో చెప్పు. అవి మాని పరిటాల కుటుంబంపై ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరు. నీ చేతిలో ఘోరంగా మోసపోయిన ప్రజలు నీకు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.' అని అన్నారు.

విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు

అనంతపురం కల్చరల్, జనవరి 5: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 850 మంది విద్యార్థులకు తాళంకి ఛారిటబుల్ ట్రస్టు, ఇండో అమెరికన్ ఐకేర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. పాతూరులోని కేజీబీవీ స్కూల్‌లో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో మొత్తం 588 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. దాదాపు 210 మందికి మందులను అందజేశారు. కార్యక్రమంలో తాళంకి ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు తాళంకి వెంకటరత్నమయ్య, తాళంకి నాగేంద్రకుమార్, పాతూరు కేజీబీవీ స్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ లక్ష్మన్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.





రామగిరి, చెన్నేకొత్తపల్లిలో అంగన్‌వాడీలకు మద్దతుగా మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

సమస్యలు పరిష్కరించాల్సిందే

సీఐటీయూ నేత ఓబులు డిమాండ్

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాల్సిందేనని, లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు హెచ్చరించారు. శుక్రవారం రామగిరి, చెన్నేకొత్తపల్లిలో అంగన్‌వాడీల సమ్మెకు సంఘీబావం తెలిపిన ఆయన మాట్లాడారు. సమ్మెను అణచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రచేస్తోందన్నారు. సమ్మె విరమించి విధుల్లోకి వెళ్లకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు నోటీసులు పంపడం ఏమిటని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కదిరెప్ప, లింగన్న, సరస్వతి, శ్రీదేవి, రమాదేవి, అంబుజాక్షి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు రమణమ్మ పాల్గొన్నారు. శింగనమలలో అంగన్వాడీలు వంట వార్పు చేసి రోడ్డుపై భోజనం చేశారు. అనంతరం మోకాళ్ల మీద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రమణమ్మ ప్రమీలా, భారతి, నాగేశ్వరి, కాంతమ్మ లక్ష్మీదేవి, రామాంజినమ్మ, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు. గార్లదిన్నెలో నిర్వ హించిన సమ్మెలో అంగన్‌వాడీల ప్రాజెక్టు కోశాధికారి లీలావతి, గార్లదిన్నె, కల్లూరు సెక్టార్లు ఫిర్‌దోజ్‌బాను, రాజేశ్వరీ, ప్రమీలరాణి, శాంతకుమారి పాల్గొన్నారు.



శింగనమలలో మోకాళ్లపై నిల్చొని..



గార్లదిన్నెలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ..

ముగిసిన శిక్షణ శిబిరం



శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 5: రాష్ట్ర బాల్ బ్యాడ్మిం టన్ పురుష, మహిళా క్రీడాకారులకు వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శుక్రవారంతో ముసిగింది. వారికి స్థానిక బాల్ బ్యాడ్మింటన్ కార్యాలయంలో జెర్సీలు (క్రీడా దుస్తులు) పంపిణీ చేశారు. శనివారం నుంచి మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నిర్వహించే 69వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొంటారని జిల్లా బ్యాడ్మింటన్ కార్యదర్శి ఈశ్వరయ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు బండమీదపల్లి వెంకటేశ్వర్లు, వెంకట్, బాబాఫక్రుద్దీన్, సీనియర్ క్రీడాకారులు రియాజుద్దీన్, మహబూబ్‌బాషా, షరీఫ్, ప్రకాష్, సందీప్, అశోక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీఎల్ క్రికెట్ పోటీలు

జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో సీనియర్ ఏపీఎల్ క్రికెట్ పోటీ లను ఆర్డీటీ మైదానంలో శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి మధుఆచారి తెలిపారు. 20 మ్యాచ్‌లు జరుగుతాయని, ఇప్పటికే స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

కరోనా కేసులు నిల్

అనంతపురం టౌన్, జనవరి 5: జిల్లాలో శుక్రవారం కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాలేదని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. వైద్యుల సూచనల మేరకు 27 మందికి పరీక్షలు నిర్వహించగా.. వారందరికీ కరోనా నెగిటివ్ వచ్చిందన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరం తనిఖీ

శింగనమల మండలం ఆకులేడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవీ తనిఖీ చేశారు. జిల్లాలో శుక్రవారం మొత్తం 15 పీహెచ్‌సీల పరిధిల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బలిజ సంఘం అధ్యక్షుడికి సన్మానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 5: రాయలసీమ బలిజ మహాసంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తొండపునాటి శంకరయ్యని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత సన్మానించారు. శుక్రవారం శంకరయ్య నివాసానికి మర్యాదపూర్వకంగా వెళ్లి సత్కరించారు.



శంకరయ్యను సన్మానిస్తున్న పెండ్యాల శ్రీలత

అనంత వెంకటరెడ్డికి ఘన నివాళి



అనంతవెంకటరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, జనవరి 5: మాజీ ఎమ్మెల్యే అనంతవెంకటరెడ్డి 21వ వర్ధంతి సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనయాడారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల వద్ద ఉన్న అనంత వెంకటరెడ్డి విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ, నాయకులు వాసు, ఫక్రుద్దీన్, చిన్నప్ప, అబ్బాస్, ఆంజినేయులు, నాగరాజు, శర్మాస్‌వలి, ఓబులేసు పాల్గొన్నారు.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం

రాప్తాడు : పదో తరగతి పరీక్షల్లో అందరూ పాస్ కావాలని స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇన్‌చార్జి హెచ్‌ఎం సాంబశివుడు సూచించారు. ఆ పాఠశాలలో చదువుతున్న 85 మంది పదో తరగతి విద్యార్థులకు స్థానికుడు రామాంజినేయులు శుక్రవారం అట్టలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, పీఈటీ కేశవమూర్తి పాల్గొన్నారు.

బీటెక్‌లో సివిల్, మెకానికల్.. 'బంగారం'

అధిక ఉద్యోగాలు సాధించిన జేఎన్‌టీయూ

అనంతపురం సెంట్రల్, జనవరి 5: ప్రస్తుతం బీటెక్‌లో ఎక్కువ మంది కంప్యూటర్ సైన్స్ వైపే మొగ్గుచూపుతున్నారు. దీంతో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్‌ల్లో చేరేవారే కరువయ్యారు. కొన్ని కళాశాలలో ఈ బ్రాంచ్‌ల సీట్లను తగ్గించి కంప్యూటర్ సైన్స్ సీట్లు పెంచుకున్నారు. మరికొన్ని కళాశాలల్లో ఏకంగా బ్రాంచ్‌లనే మూసేశారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విద్యార్థులు మాత్రం ఉత్తమ మార్కులతో అత్యధిక గోల్డ్‌మెడల్స్ సాధించారు. మా బ్రాంచ్‌లే బంగారమంటూ నిరూపించారు. 13వ స్నాతకోత్సవానికి సివిల్, మెకానికల్ బ్రాంచ్‌లకు 12 చొప్పున, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లకు నాలుగు చొప్పున బంగారు పతకాలు దక్కాయి. ఈ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు 90 శాతం వరకు ఉద్యోగాలు సాధిస్తున్నారు.





తరగని ఆదరణ



సివిల్ ఇంజనీరింగ్‌కు ప్రపంచంలో తరగని ఆదరణ ఉంది. నిర్మాణాలు, కట్టడాలు లేకుండా అభివృద్ధిని ఊహించలేం. అయితే ప్రజల్లో సివిల్ అంటే ఇళ్లను కట్టుకోవడమే కదా అన్న అపోహబలంగా ఉంది. సివిల్ ఇంజనీరింగ్‌తో స్వయం ఉపాధి, ఉద్యోగాలు మెండుగా పొందవచ్చు. సొంతంగా కన్‌స్ట్రక్షన్ సంస్థలు పెట్టుకుని అనేక మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

- డాక్టర్ అజిత, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి

మెకానికల్ కీలకం



సమాజంలోని అన్నిరంగాల్లో మెకానికల్ ఇంజనీరింగ్‌పై ఆధారపడ్డాయి. మనిషికి అవసరమైన యంత్రాలు, పరికరాలు డిజైన్‌చేసి వినియోగం తీసుకురాడంలో మెకానికల్ కీలకపాత్ర పోషిస్తుంది. అయితే మెకానికల్ బ్రాంచ్ ప్రాముఖ్యలేదని అపనమ్మకంతో ఉంటున్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ ద్వారా ఉద్యోగంలో నైపుణ్యాలు నిరంతరం పెరుగుతాయి. పలువురికి ఉద్యోగాలు కల్పించే వ్యక్తులుగా రాణిస్తారు.

- డాక్టర్ కల్యాణిరాధ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి

ఎలక్ట్రానిక్స్.. ఎవర్ గ్రీన్



ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఎవర్ గ్రీన్ బ్రాంచ్. ఉక్రెయిన్ దేశంలో అత్యధికంగా చిప్స్ మానుఫ్యాక్చరింగ్, డిజైన్ చేస్తారు. కొత్త కొత్త డిజైన్‌లతో వీడియో గేమ్స్‌ను డెవలప్ చేస్తున్నారు. యుద్ధ సమయంలో ఈ ప్రక్రియ మొత్తం ఆగిపోయింది. ఈ నేపథ్యంలో యువత అధికంగా ఉన్న మన దేశంలో సెమికండక్టర్స్, చిప్స్, వీఎల్‌ఎస్ఐ డిజైన్ ప్రక్రియ పెరిగింది. నిరంతరం ఉద్యోగులు లభిస్తాయి.

- డాక్టర్ మమత, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి

3,159 మందికి నవరత్నాల నగదు

అనంతపురం టౌన్ : అర్హత ఉండి వివిధ కారణాలతో నవరత్నాల పథకాలు మంజూరుకాని వారికి 3,159 మందికి ఆయా పథకాల కింద రూ4,89,84,106 నగదు మంజూరైనట్లు కలెక్టరు గౌతమి వెల్లడించారు. శుక్రవారం ఆ లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమచే శామన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందుకు సంబంధించి నగదు చెక్‌ను విడుదల చేశారు.

రేపు నిజపాద స్పర్శదర్శనం

అనంతపురం కల్చరల్ : స్థానిక రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో ఆదివారం నిజపాద స్పర్శదర్శనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భవసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు టౌన్, జనవరి 5: ఆలూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రఘునాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు జాబ్ మేళా

గుంతకల్లు, జనవరి5: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీకళాశాలలో ఆదివారం ఉదయం జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎన్‌సీ మొబైల్ కంపెనీ యాజమాన్యం ఈ జాబ్ మేళాను నిర్వహిస్తోందని, 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసున్న వారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మెకు స్థలం సమస్య

పామిడి, జనవరి 5: పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రోడ్డు పక్కన అంగన్‌వాడీలు చేపట్టే సమ్మెకు స్థలం సమస్య తలెత్తింది. అనుమతులు లేకుండా ఆర్టీసీ స్థలంలో సమ్మెను ఎలా చేపడతారని ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్‌వైజర్ రమణమ్మ అంగన్‌వాడీలను శుక్రవారం ప్రశ్నించారు. వెంటనే సమ్మె శిబిరంను తొలగించాలని సూచించారు.

315మందికి వైద్యపరీక్షలు

యల్లనూరు, జనవరి5: మండలంలోని 85నిట్టూరు గ్రామంలో శుక్రవారం 315మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని డాక్టర్ లోకేశ్ తెలిపారు. జగనన్న సురక్ష రెండో విడతలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిట్టూరు సచివాలయ పరిధిలోని మేడికుర్తి, వేములపల్లి, నిట్టూరు గ్రామ ప్రజలు శిబిరానికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

పుట్లూరు, జనవరి 5: మండలంలోని ఏ.కొండాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామకృష్ణను అరెస్ట్ చేసి, అతడి నుంచి 15మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ దిలీప్ కుమార్ శుక్రవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి నిందితున్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చింతకుంటలో గ్రామసభ

పుట్లూరు, జనవరి5: మండలంలోని చింతకుంట గ్రామంలో విశ్వకర్మ పథకంలో భాగంగా శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేసే అభివృద్ధి పనులపై పంచాయతీ సెక్రటరీ వివరించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై కేసు

యాడికి, జనవరి 5: ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ టైర్లకు గాలి తీశారని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, అతని అనుచరులు కొంత మందిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు శుక్రవారం యాడికి మండలం రాయలచెరువులో ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌కు జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆయన అనుచరులు రెండు వాహనాల్లో వచ్చి గాలి తీశారన్నారు. ఇసుక రవాణాకు సంబంధించి బిల్లులు ఉన్నాయని చెప్పినా వినకుండా టిప్పర్ టైర్లలో గాలి తీశారని డ్రైవర్ నరసింహులు ఫిర్యాదుచేశాడని తెలిపారు. ఫిర్యాదు మేరకు జేసీ, ఆయన అనుచరులపై కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు కూడా...

తాడిపత్రి, జనవరి5: మండలంలోని చుక్కలూరు గ్రామంలో వైసీపీ నాయకుడు భాస్కర్, అతడి భార్య ఎంపీటీసీ మేరీపై దాడి చేసిన మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితోపాటు మరికొందరిపై శుక్రవారం రాత్రి ఎస్సీ, ఎస్టీయాక్ట్ కింద కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఇసుక ట్రాక్టర్ టైర్లకు గాలి తీయడంతో పాటు అడ్డువచ్చిన తమపై దాడిచేసి రెండు సెల్‌ఫోన్లను లాక్కోన్నారని అందిన ఫిర్యాదు మేరకు జేసీతోపాటు టీడీపీ మద్దతుదారులు మల్లికార్జునరెడ్డి, హరినాథ్, ఉపేంద్ర, యాసీన్‌లపై కేసు నమోదు చేశామని తెలిపారు.

375 టెట్రా ప్యాకెట్ల స్వాధీనం

గుత్తి/ రూరల్, జనవరి 5: పట్టణ శివారులో కర్నాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న 375 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నబీరసూల్ శుక్రవారం తెలిపారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రామలింగయ్యపల్లి గ్రామానికి చెందిన ఎరుకుల తిరుపాలమ్మ బెంగళూరు నుంచి తన సొంత గ్రామానికి అక్రమంగా మద్యం తరలిస్తుండగా బసినేపల్లి గ్రామ సమీపంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కర్నాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికలు ఎందుకు జరపలేదు?

పామిడి, జనవరి 5: పామిడిని గ్రామ పంచాయతీగా మార్పు చేశామని గొప్పలు చెప్పుకునే వైసీపీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి పామిడిలో పంచాయతీ ఎన్నికలు ఎందుకు జరుపలేదని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో తన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015-16వ సంవత్సరంలో ఆరు నెలలకు నీటి పన్ను రూ. 420లు వచ్చిందన్నారు. ప్రస్తుతం పంచాయతీగా మార్చామని చెబుతూ ఏడాది నీటి పన్ను రూ. 840లు విధించారన్నారు. ఇలా పన్నులు పెంచారే కానీ అభివృద్ధి మాత్రం ఇసుమంతైనా కనిపించడం లేదన్నారు. గౌస్‌పీరా, అప్పన్నగారి కుమార్, శివశంకర్, రామకృష్ణ, వడ్డే శివకుమార్, బొమ్మామోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గుంతకల్లులో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు


గుంతకల్లులో సీఎం జగన్ ఫొటోలను మెడలో వేసుకుని ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు


రాయదుర్గంలో భిక్షమెత్తుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు


గుత్తిలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కొనసాగుతున్న నిరసన

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సమ్మెలో భాగంగా నిరసన కార్యక్రమాలతో ఉధృతం చేస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం వివిధ ప్రాంతాల్లో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గుంతకల్లులో మోకాళ్లపై నిలబడి, రాయదుర్గం, గుత్తిలో భిక్షమెత్తి, కళ్యాణదుర్గంలో సాష్టాంగ నమస్కా రం చేస్తూ నిరసన తెలిపారు.

\- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


కళ్యాణదుర్గంలో సాష్టాంగ నమస్కారం

చెల్లించినా ఇంకా అప్పు ఉందా?

సీసీని నిలదీసిన సభ్యులు

బెళుగుప్ప, జనవరి 5: తాము అప్పు చెల్లించినా ఇంకా బకాయిలున్నాయని తిప్పుతూ ఇబ్బంది పెడుతున్నారని వెలుగు అధికారులపై మండలంలోని గుండ్లపల్లి, శ్రీరంగాపురం, సంఘాల మహిళలు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇదే విషయమై సీసీ సిద్దయ్యను సభ్యులు నిలదీశారు. వైష్ణవి సంఘంలో బ్యాంకు నుంచి 2009 నుంచి 2011 వరకు తీసుకున్న సీఐఎఫ్‌లోన్ రూ.34 వేలు ఉందని, ఇది కడితే కొత్త రుణం మంజూరు చేస్తామని నాలుగైదు రోజుల నుంచి తిప్పుకుంటున్నారని వారు వాపోయారు. మేము అప్పేతీసుకోలేదని, బకాయి ఉందని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీసుకున్న అప్పు మొత్తం చెల్లించాం అయినా ఇంకా రూ. పది వేలు బకాయి ఉందని అంటున్నారని శ్రీరంగాపురం బన్ని సంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా దిగమింగి, వారిని అప్పులపాలు చేస్తున్నారని టీడీపీ నాయకులు పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, రాము, శివలు సీసీతో వాగ్వాదానికి దిగారు. ఏపీఎం వచ్చి సభ్యులకు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఏపీఎం స్పందించకపోవడంతో, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెలుగు పీడీ నరసింహారెడ్డికి తెలపడంతో రుణం మంజూరు చేయించాలని ఏపీఎంను ఆదేశించారు. ఎట్టకేలకు కొత్త రుణం ఇవ్వడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు.


బ్యాంకు వద్ద సీసీని నిలదీస్తున్న సభ్యులు

ప్రజాబలంతో వైసీపీని భూస్థాపితం చేద్దాం

కళ్యాణదుర్గం, జనవరి 5: ప్రజాబలంతో వైసీపీని భూస్థాపితం చేద్దామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. కంబదూరు మండలంలోని ఓబుగానిపల్లిలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన న్యాయవాది

సీఎం జగన్ రెడ్డి పాలనా విధానాలు నచ్చక న్యాయవాది హనుమంతరాయుడు వైసీపీ నుంచి టీడీపీలోకి శుక్రవారం చేరారు. ఉమామహేశ్వరనాయుడు న్యాయవాది హనుమంతరాయుడుకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


మహిళలకు కరపత్రాలు అందజేసి అవగాహన కల్పిస్తున్న ఉమామహేశ్వరనాయుడు

ఎమ్మెల్యే గారు..! మీరు చెప్పండి : జేసీపీఆర్

తాడిపత్రి, జనవరి 5: 'ఎమ్మెల్యేగారు మీరైనా చెప్పండి. తాడిపత్రి ప్రాంతంలో ప్రతిమ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ జయప్రకాష్ పవర్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్‌ల పేరుతో ఇసుక తరలింపునకు ఉపయోగిస్తున్న బిల్లులు నకిలీవి కాదని, అలా చెబితే నేను ఇసుక తరలింపును అడ్డుకోను' అంటూ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిలీ బిల్లులతో తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో పెన్నానదిని అడ్డాగా చేసుకొని వైసీపీ నేతలు టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా పెద్దఎత్తున ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. దీన్ని పోలీసు, రెవెన్యూ, మైనింగ్, సెబ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 'ఈ బిల్లులు ఒరిజనల్ అని ఏశాఖ అధికారి చెప్పినా , నేను చేస్తున్న పని తప్పని ఏ అధికారి చెప్పినా పట్టణ నడిబొడ్డును క్షమాపణ చెబుతా' అని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి ఇసుకలో దోచుకున్నదంతా కక్కిస్తామన్నారు.


నకిలీ బిల్లులను చూపుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

చుక్కలూరులో ఉద్రిక్తత

తాడిపత్రి మండలం చుక్కలూరులో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పెద్దవడుగూరు పర్యటనకు వెళుతున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి చుక్కలూరు వద్ద ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ కనబడింది. ట్రాక్టర్‌ను నిలిపి వివరాలు అడిగారు. ఈ ట్రాక్టర్ వైసీపీ నాయకుడు, ఎంపీటీసీ భర్త భాస్కర్‌ది అని తేలింది. డ్రైవర్ అడ్డదిడ్డంగా సమాధానం చెప్పడంతోపాటు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్ టైర్లకు గాలితీశారు. విషయం తెలుసుకున్న భాస్కర్‌తోపాటు అనుచరులు జేసీతోపాటు అనుచరులతో వాగ్వాదానికి దిగారు. సకాలంలో పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. జేసీ వెళ్లిన తర్వాత భాస్కర్‌తోపాటు అనుచరులు రోడ్డుపై కూర్చొని జేసీని అరెస్ట్ చేయాలంటూ డిమాండ్ చేశారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి

యాడికి, జనవరి5: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం యాడికిలోని రాఘవేంద్ర కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై కాలనీవాసులను ఆరాతీశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, ఆదినారాయణ, పరిమి చరణ్, రవికుమార్‌రెడ్డి, రాజశేఖర్ నాయుడు, బొట్టు శేఖర్, మాదాల అనిల్, తాండ్ర విక్రమ్, మధురాజు, రామచంద్ర, సుభాన్, ఆదినారాయణ, లక్ష్మణ్, నరసింహ, బయపురెడ్డి, నాగిరెడ్డి, రాఘవ, హరి తదితరులు ఉన్నారు.


యాడికిలో సమస్యలను ఆరాతీస్తున్నఅశ్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు: మండలకేంద్రంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని జేసీ అశ్మిత్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకొని సమస్యలపై ఆరాతీశారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆయన వెంట తాతిరెడ్డి లోకనాథరెడ్డి, గొర్తి రఘునాయుడు, బీసీ రామకృష్ణారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మండల క్లస్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, రంగస్వామి, వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

తెలుగుదేశాన్ని గెలిపించండి

డీ.హీరేహాళ్, జనవరి 5: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగళ్లి రాజు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుష్పావతి నాగళ్లి, మాజీ జడ్పీటీసీ శ్రీరాములు, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, వన్నూరుస్వామి, విజయ్, నల్లయ్య, వెంకటేష్, దేవా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


డీ.హీరేహాళ్‌లో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

బైజూస్‌తో ఒప్పందాన్ని రద్దు చేయాలి

రాయదుర్గం, జనవరి 5: బైజూస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసి విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజినేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని వినాయకసర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోకాళ్లపై నిల్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

గుంతకల్లుటౌన్: బైజూస్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు మోకాళ్లపై నిలబడి శుక్రవారం నిరసన తెలిపారు.

తాగునీటి కోసం ధర్నా

రాయదుర్గం, జనవరి 5: పట్టణంలోని 14వ వార్డు ప్రజలు తాగునీటి కోసం శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. 20 రోజులుగా నీటి సరఫరా సక్రమంగా లేదని అందుకు నిరసిస్తూ కోతిగుట్ట వద్ద ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా బైఠాయించి తొలుత రాస్తారోకో నిర్వహించారు. ఖాళీ బిందెలు చేతబట్టి అరగంటపాటు రాస్తారోకో చేయగా అక్కడకు ఎస్ఐ ప్రసాద్ చేరుకొని రాస్తారోకో వల్ల ట్రాఫిక్ అంత రాయం ఏర్పడుతుందని మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సిందిగా తెలిపారు. దీంతో ఆందో ళన చేస్తున్న ప్ర జలు ఖాళీ బిందెలు చేతబట్టి మున్సి పల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రెండురోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని, ఇపుడు ట్యాంకర్లు పంపిస్తున్నట్లు స్పష్టమైన కమిషనర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.


ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన ప్రజలు

ఎస్పీడీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

యాడికి, జనవరి5: సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులపై ఎస్పీడీ చేసిన దురుసు వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్ తెలిపారు. శుక్రవారం యాడికిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా కేజీబీవీ టీచర్లు, సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సమ్మె చేస్తున్నారన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల్సిన ఎస్పీడీ సమ్మె చేస్తున్న వారిని ఉద్దేశించి దురుసు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఉద్యోగాల నుంచి తొలగించండి, కొత్తవారికి ఉద్యోగాలు ఇవ్వండి అంటూ పరుష వ్యాఖ్యలు చేయడం మంచిదికాదని తెలిపారు. సమావేశంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు జయప్రసాదరావు, కార్యదర్శి నబీరసూల్, విశ్వనాథ్, మార్కస్, శ్రీనివాసరెడ్డి, భారతి, భాస్కర్, గోవిందు, నూర్‌మహమ్మద్, నరసింహులు, మారుతి, ఖాదర్, షెక్షావలి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి కాలవ సంతాపం

కణేకల్లు, జనవరి 5: మండలంలోని గెణిగెర గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త వడ్డే వండ్రప్ప శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు గెణిగెరకు చేరుకుని మృతుడికి పూలమాల వేసి తన సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ లాలెప్ప, ఆనంద్‌రాజ్, బాయినేని నవీన్, గెణిగెర గోపాల్‌రెడ్డి, వండ్రప్ప, హనుమంతప్ప, రంగనాథరెడ్డి, వడ్డే చంద్ర, జంబన్న, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకండి

గుత్తి, జనవరి 5: మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్న కారణంగా ప్రజలు, దుకాణాదారులు, అయా వార్డుల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా వారి ఇంటి వద్ద, దుకాణాల వద్ద ప్రత్యేక బుట్టలలో ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. 9, 10, 11, 14, 15, 16వ వార్డులలో శుక్రవారం ఆయన శానిటేషన్ పర్యవేక్షణ డ్రైవ్ నిర్వహించారు. ప్రధాన రోడ్లపై చెత్తను వేయడం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాళ్, జనవరి 5: మండలంలోని బండూరు గ్రామ సమీపంలో విద్యుత్‌తీగలు తగిలి ట్రాక్టర్‌లో ఉన్న పశుగ్రాసం శుక్రవారం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన మేరకు కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామానికి చెందిన వన్నారెడ్డి గౌనూరు గ్రామం వద్ద పశుగ్రాసం కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో ఉరవకొండకు తరలిస్తుండగా బండూరు గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తగిలి నిప్పురవ్వలు ఏర్పడటంతో మంటలు వ్యాపించి పశుగ్రాసం దగ్ధమైంది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. పశుగ్రాసం విలువ రూ. ఐదువేలకుపైగా ఉంటుందని తెలిపారు.

ఆ భూముల్లో అక్రమాలు అవాస్తవం

తహసీల్దారు శేషారెడ్డి

కూడేరు, జనవరి 5: మండలంలోని కమ్మూరు పొలం సర్వే నంబర్ 555లోని భూమిలో ఎటువంటి అక్రమాలు జరగలేదని తహసీల్దారు శేషారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆ సర్వేనంబర్‌లోని 13 ఎకరాల 87 సెంట్ల భూమిలో 7 ఎకరాల విషయంలో వస్తున్న అపోహలు నమ్మవద్దని, ఆ భూమి ఇద్దరి పేరు మీద ఉందని, ఎన్‌ఓసీ కూడా ఇచ్చారని తెలిపారు. మిగిలిన 6.87 సెంట్ల భూమిలో కూడా రైతులు సాగులో ఉన్నారని, ఎన్‌ఓసీకి సంబంధిత రైతులు దరఖాస్తు చేసుకోలేదని తెలిపారు. కమ్మూరు పొలంలోని 555 సర్వేనంబర్‌పైనే ఆరోపణలను ఎవరూ నమ్మవద్దని ఆయన కోరారు.

మాట తప్పిన ఎమ్మెల్యే: పీజేఆర్


మూతబడిన ఏసీఎస్ మిల్లు వద్ద జీవానందరెడ్డి, టీడీపీ నాయకులు

గుంతకల్లు, జనవరి5: ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్ర సమయంలో ఏసీఎస్ మిల్లును తెరిపిస్తానంటూ హామీ ఇచ్చిన వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత మాట తప్పారని టీడీపీ నాయకుడు పెరుమాళ్ల జీవానంద రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక స్పిన్నింగ్ మిల్లును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లును తెరిపిస్తానని శుష్క వాగ్దానం ఇచ్చిన వెంకటరామిరెడ్డి కనీసం మూతపడిన మిల్లును సందర్శించిన పాపాన పోలేద న్నారు. పింఛనును పెంచామంటూ సభలుపెట్టి ప్రచారాలు ఊదరగొడుతున్న వైసీపీ ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటమేనని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: ఉన్నం


కరపత్రాలు పంచుతున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

కళ్యాణదుర్గం, జనవరి 5: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయ చౌదరి విమర్శించారు. శుక్రవారం మండలలోని మల్లికార్జునపల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోళ్ల వెంకటేశులు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.


గుమ్మఘట్టలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు


కళ్యాణదుర్గంలో సమ్మె శిబిరం ఎదుట కోలాటం ఆడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


రాయదుర్గంలో నల్లబెలూన్లతో నిరసన


ఉరవకొండలో అంగన్‌వాడీ కార్యకర్తల దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న సీపీఐ నాయకులు


యాడికిలో మోకాళ్లపై మొక్కుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు


గుంతకల్లులో సెల్‌ఫోన్లకు పూలు పెట్టి పాటలు పాడుతున్న అంగన్‌వాడీ వర్కర్లు


విడపనకల్లులో నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

తగ్గని ఉద్యమ వేడి

తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 25వ రోజు కొనసాగింది. వివిధ ప్రాంతాల్లో అంగన్‌వాడీలు తమ నిరసనను విభిన్న రీతుల్లో వ్యక్తం చేశారు. వీరికి వామపక్షాలతో పాటు ఇతర పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

\- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


బెళుగుప్పలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


కుందుర్పి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టిన అంగన్‌వాడీలు